మరింత స్మార్ట్‌గా..

తళతళ మెరుస్తున్న రహదారులు.. దుర్గంధమనే మాటే మరిచేలా డ్రైనేజీలు.. కాంతులు విరజిమ్మే విద్యుత్ దీపాలు.. సందర్శకులను ఆకట్టుకునే రీతిలో స్మార్ట్ బస్‌బేలు.. ఇలా.. అభివృద్ధి అంటే ఇది కదా అని ప్రజల మన్ననలు పొందేలా మార్పు చెందింది 21వ వార్డు. ఈ వార్డులో అత్యధిక భాగం పర్యాటకప్రాంతమైన ఆర్కే బీచ్ ఉండటంతో ప్రత్యేక శ్రద్ధతో పనులు చేపట్టారు. ఐదేళ్లలో సుమారు రూ.25.41 కోట్లతో వార్డులో 142 పనులు చేపట్టి ప్రశంసలందుకున్నారు.

- రూ.25.41 కోట్లతో 21వ వార్డు అభివృద్ధి
- పర్యాటకాభివృద్ధిపై స్పెషల్ ఫోకస్
- సందర్శకులు, ప్రజల హర్షాతిరేకాలు



అద్దంలా బీచ్‌రోడ్డు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 21వ వార్డు అభివృద్ధికి చిరునామాగా నిలిచింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా గడిచిన ఐదేళ్లలో వార్డు అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏకంగా రూ.25.41 కోట్లు ఖర్చు చేసింది. వార్డులో ఆర్కే బీచ్‌ను అనూహ్య రీతిలో అభివృద్ధి చేసిన ప్రభుత్వం, నివాసిత ప్రాంతాల్లో మౌలిక వసతులపై ప్రధానంగా దృష్టి సారించింది. రహదారులు, డ్రైనేజీలను నిర్మించడంతో పాటు ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు పార్కులను అభివృద్ధి చేసింది.

ఆర్థిక సంవత్సరం	నిధులు
2019-20	రూ.4.75 కోట్లు
2020-21	రూ.2.35 కోట్లు
2021-22	రూ.5.18 కోట్లు
2022-23	రూ.1.98 కోట్లు
2023-24	రూ.11.16 కోట్లు

రూ.46 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం

ప్రజా సమస్యల తక్షణ పరిష్కారం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా రూపొందించి, అమలు చేసిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సత్ఫలితాలను అందించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను తెలుసుకుని రూ.46.14 లక్షలతో పనులు చేపట్టారు. ఈ నిధులతో చిన్నవాల్తేరు ప్రాంతంలో నాలుగు డ్రైనేజీలకు మరమ్మతులు చేశారు.

ఎంపీ నిధులతో రోడ్డు నిర్మాణం

విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ సహకారంతో, ఎంపీ నిధులతో ఏయూ అవుట్ గేట్ డౌన్‌లో రూ.25 లక్షలతో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు.

అత్యధికంగా పర్యటకాభివృద్ధి

విశాఖ అంటే ప్రతీ ఒక్కరికి గుర్తు వచ్చే ప్రాంతం ఆర్కే బీచ్. ఈ బీచ్ 21వ వార్డు పరిధిలో ఉండటంతో ఈ వార్డు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. బీచ్‌కు వచ్చి పర్యాటకులకు ఇబ్బంది లేకుండా వారికి మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు నిరంతరం పనులు చేపడుతూనే ఉంది. ఇందుకోసం కోట్ల రూపాయలను వెచ్చించింది. కొత్త రోడ్ల నిర్మాణం, ఫుట్ పాత్‌ల విస్తరణ, భద్రత గోడ నిర్మాణం, తీరంలోకి మెట్ల మార్గం నిర్మాణం, కొబ్బరిచెట్లు భద్రత గోడ, డిజిటల్ బోర్డుల ఏర్పాటు, చిన్నపిల్లల కోసం చిల్డ్రన్ ఎబిలిటీ పార్క్ అభివృద్ధి.. ఇలా అనేక పనులను జీవీఎంసీ చేపట్టింది.

రెండు స్మార్ట్ బే బస్ స్టాపులు

నగరంలో తొలి బే బస్ స్టాప్‌ను జీవీఎంసీ 21వ వార్డులోని ఏయూ అవుట్ గేట్ వద్ద జీవీఎంసీ నిర్మించింది. దీనికి ప్రజల నుంచి మంచి ఆదరణ రావడంతో నగర వ్యాప్తంగా బస్‌బేల నిర్మాణాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా అతి పెద్ద స్మార్ట్ బే బస్ స్టాప్‌ను ఆర్కే బీచ్ వద్ద రూ. 20 లక్షలతో నిర్మించింది. దీనితో వార్డు పరిధిలో ఇప్పటి వరకు రూ.38 లక్షలతో రెండు స్మార్ట్ బే బస్ స్టాపులను నిర్మించినట్లైంది..

రెండు ఓపెన్ జిమ్‌లు

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెడుతూ వార్డు పరిధిలో రెండు ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసిన మొదటి వార్డు కూడా 21 కావడం విశేషం.

రోడ్లు, డ్రైనేజీలకు రూ.8.45 కోట్లు

వార్డు పరిధిలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు మరమ్మతులు, నిర్మాణాలకు ప్రభుత్వం ఏకంగా రూ.8.45 కోట్లు ఖర్చు చేసింది. గడిచిన ఐదేళ్లలో రోడ్లు, డ్రైనేజీలకు సంబంధించి 53 పనులను వార్డు పరిధిలో జీవీఎంసీ పూర్తి చేసింది. మిగిలినవి దాదాపు 89 పనులు చేపట్టింది.

తొలి స్మార్ట్ టాయిలెట్స్

పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పించి వారిని ఆకర్షించే విధంగా తొలి స్మార్ట్ టాయిలెట్స్‌ను రూ.20 లక్షలతో వైఎంసీఏ వద్ద జీవీఎంసీ నిర్మించింది. ఈ టాయిలెట్స్‌లో వెస్ట్రన్ వసతులతో పాటు, వేడి నీరు, హెయిర్ డ్రయర్, పిల్లలకు తల్లి పాలు ఇచ్చేందుకు ప్రత్యేక గది ఏర్పాటు చేశారు. ఇవే కాకుండా పర్యాటక ప్రాంతంలో ఉన్న రెండు మరుగుదొడ్లకు మరమ్మతులు, చేపట్టి అందంగా తీర్చిదిద్దారు.



స్మార్ట్ టాయిలెట్స్

పచ్చదనం కోసం రూ.2.2 కోట్లు

తీరాన్ని అందంగా తీర్చిదిద్దడంలో భాగంగా బీచ్‌రోడ్డులో పచ్చదనం కోసం రూ.2.2 కోట్లును ఖర్చు చేశారు. అందులో హార్టికల్చర్ విభాగం రూ. 20 లక్షలతో మొక్కలు, వివిధ రకాల ఆకృతులను ఏర్పాటు చేయగా.. వాటి పరిరక్షణ కోసం జీవీఎంసీ రూ.2 కోట్లతో ఇనుప కంచెలను బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసింది. దీంతో తీరప్రాంతం హరితశోభితమైంది.



తీరంలో ఏర్పాటు చేసిన పచ్చదనం



స్మార్ట్ బే బస్ స్టాప్

ప్రతీ వీధికి డ్రైనేజీ, రోడ్డు మార్గం



చిన్నవాల్తేరు ప్రాంతంలో గతంలో సరైన డ్రైనేజీ, రోడ్లు లేక చాలా ఇబ్బంది పడేవాళ్లం. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక వర్షం వస్తే మురుగునీరు ఇంట్లోకి వచ్చేసేది. రోడ్లన్నీ బురదతో నిండి ఉండేవి. ఇప్పుడు మా ప్రాంతం ఎంతో మారింది. ప్రతీ వీధిలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మించారు. వర్షాకాలం వచ్చినా ఇప్పుడిక సమస్య లేదు.

– ఎం.రవికుమార్, 21వ వార్డు

బీచ్ వద్ద వసతులు బాగున్నాయి



ఆర్కే బీచ్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారు. తీరంలో పచ్చదనం, రోడ్లు, విద్యుత్ దీపాలు, ఫుట్‌పాత్‌లు చాలా బాగున్నాయి. తీరంలో ఎక్కడికక్కడ దిగేందుకు మెట్లు నిర్మించారు. రక్షణ గోడ కూడా చాలా పటిష్టంగా నిర్మించారు. తీరం వెంబడి గోడలపై పెయింటింగ్స్‌తో తీరం మరింత అందంగా కనిపిస్తోంది.

– నిరుపమ, సందర్శకురాలు

క్లుప్తంగా

గెడ్డలో పూడిక తొలగింపు



జీవీఎంసీ సిబ్బందితో గెడ్డలో పూడిక తీయిస్తున్న పీతల గోవింద్

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు మంగాపురం కాలనీలో గల గెడ్డ పూడికతో నిండిపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. ఈ సమస్యను స్థానికులు వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పీతల గోవింద్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే జీవీఎంసీ సిబ్బందితో మాట్లాడారు. దీంతో బుధవారం జీవీఎంసీ సిబ్బంది గెడ్డలో పూడిక తొలగించారు. ఈ పనులను పీతల గోవింద్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు గోవింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

3 నుంచి మహిళలకు వేసవి శిక్షణ తరగతులు

మురళీనగర్: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 3 నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ పేస్ట్రీ షాపు సమీపంలోని భవనంలో కె.సుగుణ ఆధ్వర్యంలో మహిళలకు జ్యూట్ బ్యాగ్స్ స్టిచింగ్‌పై పది రోజుల పాటు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల వారు 90320 94771 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సీతమ్మధార రైతుబజార్‌లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారి రామారావు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో బుధవారం తూనికలు, కొలతలు శాఖ అధికారులు తనిఖీలు చేశారు. తనిఖీ అధికారి రామారావు కాటాలను పరిశీలించారు. సీల్ లేకపోవడంతో ఐదుగురు రైతులకు సంబంధించిన కాటాలకు జారిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాటాలకు సీల్ వేయించుకోవాలని, లేనిపక్షంలో ఫైన్ వేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు బజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే ప్రశాంత ఎన్నికలు



హైవేపై కవాతు చేస్తున్న ఎస్ఐ వెంకటరావు, సీఐఎస్ఎఫ్ బలగాలు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం పోలీసులు, కేంద్ర పోలీస్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. ఈస్ట్ ఏసీపీ మెహర్ జయరాం ప్రసాద్ నేతృత్వంలో సీఐ ఎస్.విజయకుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరావు,సివిల్ పోలీసులు, బలగాలు సంయుక్తంగా కవాతు చేపట్టారు. అక్కయ్యపాలెం, నందగిరినగర్, తాటిచెట్లపాలెం, ఏఎస్సార్ నగర్, 80 ఫీట్ రోడ్డు ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ చేస్తూ స్థానిక ప్రజలకు ఓటు హక్కు పై అవగాహన కలిగించారు. సీఐ విజయకుమార్ మాట్లాడుతూ నగరానికి కేంద్ర ఎన్నికల సంఘం పంపిన సీఐఎస్ఎఫ్ బలగాలతో సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాలను పరిశీలించడమే కాకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా తామున్నామనే భరోసా కల్పించేందుకు కవాతు చేశామన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ పరమావధి

'మేము సిద్ధం, మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో ఎంవీవీ



సిద్ధం సభలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ



పాండురంగాపురంలో సిద్ధం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: రాష్ట్రంలో పేదల బాగు కోసమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డు పరిధి పాండురంగాపురంలో 'మేము సిద్ధం, మా బూత్ సిద్ధం'సభ బుధవారం నిర్వహించారు. ఈ సభలో ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బడుగు బలహీన వర్గాలకు ఇచ్చిన హామీల మేరకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించారన్నారు. మేనిఫెస్టోను భగవద్గీతగా భావించి 100 శాతం హామీలు నెరవేర్చారన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కల్ల సునీత, నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ విద్యార్థుల ఆ హబ్ సందర్శన



ఆ హబ్‌లో డీసీఎంఎస్ విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులు ఏయూ స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్‌ని సందర్శించారు. ఇక్కడ పని చేస్తున్న అంకుర సంస్థల పనితీరు, ప్రగతి, ఆవిర్భావం, వ్యవస్థ స్థాపించిన విధానం తదితర అంశాలను తెలుసుకున్నారు. మేధో హక్కుల పరిరక్షణ, తమ ఆలోచనలను అంకుర సంస్థలుగా మార్పు చేసే దిశగా చేసే ప్రయత్నం తదితర అంశాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏయూ స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో విద్యార్థులనుద్దేశించి ప్రత్యేక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఆచార్య ఎన్.సాంబశివరావు, ఆచార్య బి.సుబ్బయ్య, డాక్టర్ ఎ.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

18వ వార్డులో ఎంపీ ఎంవీవీ విస్తృత ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీకాలనీ: విశాఖ ఎంపీ, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర బుధవారం 18వ వార్డులో కొనసాగింది. 73వ రోజు 18వ వార్డులో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జగనన్న గెలుపుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్ సాధ్యమవుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఓటర్లు అఖండ మెజారిటీతో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. గత కొంత కాలంగా తూర్పు నియోజకవర్గం అభివృద్ధికి తాను చేస్తున్న కృషిని వివరించారు. ఇక్కడి ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దిగినట్లు వెల్లడించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన ఇన్ఫోసిస్ ప్రతినిధులు



ఇన్ఫోసిస్ ప్రతినిధి సురేష్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని ఇన్ఫోసిస్ విశాఖ కేంద్రం ప్రతినిధులు సందర్శించారు. ఇన్ఫోసిస్ విశాఖపట్నం డెలివరీ సెంటర్ హెడ్ ఎన్.సురేష్ బుధవారం ఉదయం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో సమావేశమై, వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సురేష్‌ను వర్సిటీ తరపున సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి మూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏయూ ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్‌ను ప్రత్యక్షంగా పరిశీలించి, అక్కడ వివిధ సంస్థలు నిర్వహిస్తున్న విధానం, యువత పారిశ్రామిక వేత్తలుగా సంస్థలను ప్రారంభించి పనిచేస్తున్న విధానాన్ని పరిశీలించారు.

మానవతా దృక్పథం పెరగాలి



సదస్సు సంచికను అవిష్కరిస్తున్న ఆచార్య రజని తదితరులు

ఏయూక్యాంపస్: సమాజంలో మతవిశ్వాసాల కంటే మానవతా దృక్పథం నెలకొల్పడం ఎంతో అవసరమని శ్రీకాకుళం డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.ఆర్. రజని అన్నారు. ఏయూ తత్వశాస్త్ర విభాగంలో బుధవారం నిర్వహించిన ధార్మిక విజ్ఞాన పరిణామం-ప్రాచీన సంప్రదాయాలపై ఆధునిక దృక్పథాలు అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. మనుషుల మధ్య మతం అడ్డుగోడగా మారకూడదన్నారు. మతాల సారాంశం తోటి వారిని ప్రేమించడమే అన్నారు. స్వార్థంతో మత ఘర్షణలకు పాల్పడుతూ మానవుడు సమాజంలో అశాంతికి కారణంగా మారుతున్నాడని ఈ విధానంలో మార్పు రావాలని ఆకాంక్షించారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ సాంకేతిక ప్రగతి నేపథ్యంలో ప్రపంచం కుగ్రామంగా మారిందని, అదే సమయంలో మానవతా విలువలు లోపిస్తున్నాయన్నారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ప్రాచీన ధార్మిక విషయాలలో ఉన్న జ్ఞానాన్ని నేటితరం యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. బెంగళూరు యాక్ట్స్ అకాడమీకి చెందిన సంతోష్ జ్ఞానకస్, విభాగాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు, అమెరికాలోని బ్రిగామ్ యంగ్ యూనివర్సిటీ ఆంత్రోపాలజీ ఆచార్యులు చార్లెస్ విలియం నికోలస్, డాక్టర్ బి.వెంకట స్వామి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సు సంచికను అతిథులు ఆవిష్కరించారు.

విమ్స్‌లో కార్పెంటర్ల ఉచిత సేవలు



విమ్స్‌లో మరమ్మతులు చేస్తున్న కార్పెంటర్లు

ఆరిలోవ: కార్పెంటర్ల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్పెంటర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో ఉచిత సేవలు అందించారు. విమ్స్‌లో కుర్చీలు, టేబుళ్లు, తలుపులు, కిటికీలు ద్వారబంధాలలో పాడైన వాటిని గుర్తించి, ఉచితంగా మరమ్మతులు చేశారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వేముల కన్నప్రసాద్ మాట్లాడుతూ కార్పెంటర్ల దినోత్సవం సందర్భంగా 2014 నుంచి ప్రభుత్వ కార్యాలయాలలో ఉచితంగా సేవలు అందిస్తున్నామన్నారు. దీంతో పాటు జిల్లాలో కొన్ని మండలాల్లో కూడా ప్రభుత్వ కార్యాలయాలలో మరమ్మతులు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు కార్పెంటర్ల అసోసియేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ఆదేశం



మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ప్రతి సెక్టార్ అధికారి తన పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో వంద శాతం కనీస సౌకర్యాలు కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఈఆర్‌వో, సెక్టోరియల్, రూట్ అధికారులు, సూపర్‌వైజర్లతో పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల ఏర్పాటు, ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గ అధికారులతో జాయింట్ కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల కమీషన్‌మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ర్యాంపులు, మరుగుదొడ్డి, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, లైటింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఇందులో ఈఆర్‌వోలు ఇచ్చిన నివేదిక మేరకు ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి ఈ నెల చివరిలోగా వందశాతం పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు పూర్తి చేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను మరొకసారి క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ప్రతి సెక్టార్ అధికారి తన పరిధిలో ఉన్న రూట్లను ఫైనలైజ్ చేయాలని ఆదేశించారు. బస్సులు వెళ్లడానికి అనుకూలంగా లేని చోట చిన్న వాహనాలకు ప్రతిపాదన చేయాలని అన్నారు.

ఈవీఎంల వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం లే అవుట్ సర్వే చేయాలని అన్నారు. పోలింగ్ కేంద్రం పేరు అందరికీ కనిపించేలా ఉండాలని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువ ఉన్నచోట ప్రజలకు ఓటు పట్ల చైతన్యం కలిగించేలా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తూర్పు ఈఆర్‌వో సునీత, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ అనూష, జీవీఎంసి ఈఈ, రూరల్ ఎంఆర్‌వో తదితరులు పాల్గొన్నారు.

అరుదైన చికిత్సతో రోగికి ప్రాణదానం



చికిత్స పొందిన రోగితో మెడికవర్ వైద్య బృందం

ఎంవీపీకాలనీ: ఆంధ్రప్రదేశ్‌లోనే తొలిసారి విశాఖ మెడికవర్ ఆస్పత్రిలో ఊపిరితిత్తుల సమస్యకు అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించారు. అరుదైన 'డీప్ క్లీనింగ్ లండ్ వాస్'చికిత్స ద్వారా ఓ మహిళ ప్రాణాలు కాపాడారు. ఈ మేరకు ఆస్పత్రి యాజమాన్యం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఒడిశాకు చెందిన 43 ఏళ్ల మహిళ ఆయాసంతో పాటు రక్తంలో ఆక్సిజన్ శాతం తక్కువ కావడం వంటి సమస్యలతో బాధపడుతూ విశాఖ మెడికవర్‌లో చేరారు. దీంతో ఆమెకు మెడికవర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ సుధీర్ తలే బృందం బ్రోంకోస్కోపీ, సీటీ స్కాన్ పరీక్షలు నిర్వహించింది. ఆమెకు అరుదైన పల్మనరీ అల్వియోలార్ ప్రోటీనోసిస్ వ్యాధి ఉన్నట్లు గుర్తించింది. అనంతరం ఆమెకు సాధారణ అనస్థీషియాతో డబుల్ లంగ్ వెంటిలేషన్ ద్వారా సుమారు 15 లీటర్ల సెలైన్‌తో ఊపిరితిత్తులను డీప్ క్లీనింగ్ చేశారు. ఎలాంటి శ్వాస సంబంధ సమస్యలు తలెత్తకుండా అరుదైన ఈ పక్రియ నిర్వహించేందుకు వైద్యుల బృందం 4 గంటల పాటు శ్రమించింది. ఈ సందర్భంగా డాక్టర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ ఈ వ్యాధి కోటి మందిలో ఒకరిద్దరికి సంభవిస్తుందన్నారు. రాష్ట్రంలో తొలిసారి ఈ వ్యాధికి మెడికవర్‌లో విజయవంతంగా చికిత్స అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకున్నారన్నారు. ఈ చికిత్సలో డాక్టర్ మోనీసా, డాక్టర్ సత్యపద్మజ, డాక్టర్ స్రవంతి, అనస్థీషియా వైద్య బృందం భాగస్వాములైనట్లు వెల్లడించారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాసరావు భక్తుల నామగోత్రాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తులు అమ్మవారికి జలాభిషేకం, పూజలు జరిపారు. అమ్మవారిని పసుపు, కుంకుమలతో అభిషేకించారు. పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి అంతర్జాతీయ గణిత శాస్త్ర సదస్సు



పోస్టర్ విడుదల చేస్తున్న ఆచార్య అనురాధ కామేశ్వరి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం గణిత శాస్త్ర విభాగంలో ఈనెల 30, 31 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు సంచాలకులు, గణిత శాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.అనురాధ కామేశ్వరి తెలిపారు. సదస్సు పోస్టర్‌ను బుధవారం ఆచార్యులతో కలిసి ఆవిష్కరించారు. గణితం, అనువర్తిత గణితం, ఇంజినీరింగ్ గణితం అంశాలపై సదస్సు జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర సొసైటీ ఫర్ మ్యాథమెటికల్ సైన్సెస్, ఆచార్య ఎస్.మీనాక్షి సుందరం మెమోరియల్ సొసైటీ, ఏయూ గణితశాస్త్ర విభాగం సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తాయని తెలిపారు. కొరియా నుంచి ఆచార్య వై.జె. చో, ఆచార్య జి.వి.ఆర్. బాబు కీలకోపన్యాసాలు చేస్తారన్నారు. నేపాల్, ఆస్ట్రేలియా, భారత్‌కు చెందిన 12 మంది వక్తలతో పాటు 200 మంది వరకు ప్రతినిధులు హాజరవుతాని తెలిపారు. కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.హెచ్. శ్రీనివాసరావు, విభాగ ఆచార్యులు పి.డి.ఎస్. శ్రీనివాసు, ఆచార్య జి.నానాజీ రావు, ఎస్.రవికుమార్, ఆచార్య ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.